క్లుప్తంగా

క్షతగాత్రుడికి ఆర్థిక సహాయం



బాధితుడు వాసుకు నగదు అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన భవననిర్మాణ కార్మికుడు జి.వాసుకు వేణుగోపాల భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీఅధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్,ఎస్.కృష్ణ ఆర్థికసహాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుడు వాసు తాపీపని చేస్తుండగా ప్రమాదానికి గురవడంతో నెల రోజులుగా పనిలోకి వెళ్లక పోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి సంఘం నుంచి వాసు ఇంటికి వెళ్లి సంఘం తరపున రూ.5వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎం.శంకరరావు, టి.వెంకట రమణ, ఎస్ గోపి, సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలోని పలు వార్డుల్లో నీటి సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.1వ వార్డు ఒరియాపండావీధిలో గల 3వ రిజర్వాయర్ డిస్ట్రిబ్యుషన్ పైప్‌లైన్ వాల్ మరమ్మతుల బారిన పడిందని, ఈ కారణంగా 1,2,3,4,5,6,7,28,29 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని కోరారు.

డిగ్రీలో ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రారంభం

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసిందని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌కు మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నామని, ప్రత్యేక కేటగిరీ వారి ధ్రువపత్రాల పరిశీలనకు 4 నుంచి 6 వరకు సమయం ఇచ్చారని పేర్కొన్నారు. కోర్సుల ఎంపికకు ఐచ్ఛికాల నమోదుకు ఈ నెల 11 నుంచి 15 వరకు అవకాశం కల్పించారని, సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 20-22 లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

మార్కెట్‌లో కాలువ పనులు



కాలువ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఈఓ

సీతానగరం: మండల కేంద్రంలోని మార్కెట్‌లో రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో రోడ్డును ఆనుకుని వృథానీరు, వర్షంనీరు మళ్లించడానికి అవసరమై కాలువ పనులు సర్పంచ్ జె.తేరేజమ్మ పర్యవేక్షణలో చేపడు తున్నామని పంచాయతీ ఈఓ జె.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీతానగరం వచ్చిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రధాన రహదారిపై ఇళ్లలోని వాడుక నీరు, వర్షం నీరు మళ్లించకపోవడం వల్ల తరచూ బీటీ రోడ్డులో గోతులు ఏర్పడుతున్నాయని తద్వారా ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే బోనెల విజచయంద్ర దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. గోతులుపూడ్చిన వెంటనే వృథానీరు మళ్లించడానికి కాలువను ఏర్పాటు చేయాలని ఇచ్చిన సూచనల మేరకు పనులు జరుగుతున్నాయని పంచాయతీ ఈఓ తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, జె.గరికయ్య, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



చాటాయవలస ఆర్‌బీకే వద్ద అన్‌లోడ్ చేస్తున్న ఎరువుల బస్తాలు

రేగిడి: మండలంలోని ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)లకు యూరియా, డీఏపీ వంటి ఎరువులు వచ్చి, చేరుతున్నాయి. ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాలు, ఎరువులు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి, అవసరమైన వాటిని తీసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం అన్నిచోట్ల ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయన్నారు. మంచి దిగుబడులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే కొనుగోలు చేసి, వాడుకోవాలని సూచించారు.

పకడ్బందీగా పథకాలు అమలుచేయాలి

● సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



పాలకొండ: శాఖల వారీగా అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. ఏజెన్సీలో అమలుచేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మనబడి–నాడు నేడు పనుల్లో అక్రమాలు జరిగాయని, అక్రమార్కులపై చర్యలు తీసుకుంటానన్నారు. చాలాచోట్ల పాఠశాలలు రేకులషెడ్డులలో నడుస్తున్నాయని, ఆయాచోట్ల విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ఎరువులు, విత్తనాలు రైతులకు సకాలంలో అందేలా చూడాలన్నారు. జీసీసీ ద్వారా సొసైటీ బాడీని ఏర్పాటు చేయాలని బ్రాంచి మేనేజర్ దాసరి కృష్ణకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి పరిస్థితులు విపరీతంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, పాడైన సోలార్ రక్షిత మంచినీటి పథకాలను బాగుచేసి, తాగునీరు సరఫరా జరిగేలా చేయాలన్నారు. ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పీహో రంగలక్ష్మి తెలిపారు. హార్టీకల్చర్, రెవెన్యూ, హౌసింగ్ తదితర శాఖలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ మహేష్, ఎంఈవో ఆనందరావు, వ్యవసాయాధికారి శ్రీదేవి, ఏపీవోలు సాగర్, బాబూరావు, ఫిషరీస్ ఏడీ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రభుత్వ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యం వంటి సదుపాయాలు మరింత మెరుగ్గా ఉండేలా చూడాలని తెలిపారు. అధికారుల సమన్వయంతో గ్రామీణ ప్రజల అవసరాలను తీర్చేలా పనిచేస్తామని ఎమ్మెల్యే అన్నారు. తహసీల్దార్ వరహాలు, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరఘట్టంలో సమీక్ష..

వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి అధికారులంతా తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల పూర్తి వివరాలతో హాజరుకావాలని కోరారు.

ఆగస్టు 31 వరకు 'స్టాప్ డయేరియా'



డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: డయేరియా నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలోని ప్రతీ గ్రామంలోని ప్రజలు డయేరియా బారినపడకుండా అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి, ఆయా వ్యాధుల బారినపడకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బొడ్డగూడ ప్రభుత్వ గిరిజన పాఠశాలలో డయేరియా వ్యాధి లక్షణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. భామిని వైద్యాధికారి పసుపులేటి సోయల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్షాకాలంలో కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా బారినపడతామని, ఈ నేపథ్యంలో ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ కాచివడపోసిన నీటినే తాగాలని, మంచి ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతీగ్రామంలో డయోరియా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

'చేయూత' అందని వారి పేర్లు సేకరణ



చేయూత పథకం లబ్ధిదారుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

భామిని: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన వైఎస్సార్ చేయూత పథకం డబ్బులు అందని వారి పేర్లను వెలుగు శాఖ అధికారులు సేకరిస్తున్నారు. జూన్ 26వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పలువురు లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాల్లో పథకం నగదు పడలేదని ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలు జారీ చేయగా, మండలంలోని నేరడి–బి, గురండి గ్రామాల్లో వెలుగు శాఖ అధికారులు మంగళవారం పర్యటించి, పథకం లబ్ధి అందని వారి వివరాలను సేకరించారు. దీంతో లబ్ధిదారులు త్వరలో తమ ఖాతాల్లో డబ్బులు పడతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో కిశోర్‌కుమార్

భామిని: ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో కె.కిశోర్‌కుమార్ మంగళవారం సూచించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని, ప్రతీ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని తెలిపారు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, ప్రతీ ఇంటికి తాగునీరు అందివ్వాలన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, కార్యకర్తలు

కురుపాం: నీట్ పరీక్ష రద్దును డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీన విద్యార్థి సంఘాలు చేపట్టే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.శేఖర్, నవీన్ కోరారు. మండల కేంద్రంలో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) విఫలమైందని, ఎప్పటికప్పుడు పోటీ పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్ష లీకేజీ తెరవెనుక జరిగిన కుంభకోణం, నీట్ పీజీ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ పరీక్ష స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవల నీట్, నెట్ పరీక్షలు రాసి, తీవ్రంగా నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలని, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే కేంద్రం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, ముంబై ఐఐటీ నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై జరుగుతున్న అణచివేత ధోరణని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో బుగ్నేష్, గౌతమ్, శ్రీను, రాజగోపాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



మానవహారంగా ఏర్పడి, నినాదాలు చేస్తున్న డాక్టర్ పావని, వైద్య సిబ్బంది

సీతానగరం: డెంగీవ్యాధి రహిత సమాజ స్థాపనకు వైద్యసిబ్బంది కృషి చేయాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని పిలుపునిచ్చారు. డెంగీ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బి.పావని, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలో సదస్సు, రాష్ట్ర రహదారిపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ డెంగీవ్యాధి లక్షణాలున్నట్లు రోగనిర్ధారణ అయిన వారికి వైద్యసిబ్బంది పర్య వేక్షణలో అత్యవసర వైద్య సేవలు అందించనున్నామన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు, డెంగీ వ్యాధి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. డెంగీవ్యాధి లక్షణాలు, నివారణాచర్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించుకుని వైద్య సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. అన్ని రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి మార్కెట్‌వరకూ ర్యాలీ నిర్వహించి రాష్ట్ర రహదారిపై వైద్య సిబ్బందితో మానవహారం రూపొందించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మ, ఏఎన్‌ఎంలు, వెల్‌నెస్ కేంద్రాల సహాయకులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మోక్షప్రదాయిని.. భగవద్గీత



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీతను పఠిస్తే మోక్షం లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సభ మంగళవారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవడం దినచర్యగా చేసుకోవాలని, భగవద్గీత చదవడం ద్వారా చెడుగీతలు చెరిగిపోతాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పని ఒత్తిడి, కుటుంబ తగాదాల కారణంగా మానసిక ప్రశాంతత లేని జీవితం గడుపుతున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అందరూ దైవసేవకు ముందుకు రావాలని, తమకు తోచిన సాయం లేనివారికి చేయాలని కోరారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్యస్మరణానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

● జిల్లా మలేరియా నివారణ అధికారి(డీఎంవో) టి.జగన్‌మోహన్‌రావు



సూచనలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ:

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి(డీఎంవో) టి.జగన్‌మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలు, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే జరగాలని, ప్రతీ గ్రామాన్ని సందర్శించి, జ్వరపీడితులను గుర్తించి, వారికి వెంటనే వైద్యసేవలు అందేలా చేయాలన్నారు. వర్షాకాలంలో మురుగునీటి నిల్వల కారణంగా విపరీతంగా పెరిగే దోమల కారణంగా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని, అలాగే కలుషితనీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా కూడా వస్తుందన్న విషయాలు గ్రామీణులకు తెలియజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ గ్రామంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు డయేరియా సోకకుండా చూడాలన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అనారోగ్యం బారినపడకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.గణేష్ పట్నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్‌కుమార్, సీహెచ్‌వో బంగారుబాబు, సూపర్‌వైజర్లు శోభ, కృష్ణశారద, బద్రినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంటకాలు రుచికరంగా ఉండాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈవో పగడాలమ్మ

జియ్యమ్మవలస: మండలంలోని పిప్పలబద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా డీఈవో జి.పగడాలమ్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అలాగే అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్నం భోజనం వంటకాలు రుచి చూసి, వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, మెనూ ప్రకారం వంటకాలు చేసి విద్యార్థులకు పెట్టాలని తెలిపారు. ఆ తర్వాత ఆమె స్వయంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. అంతకుముందు తరగతుల వారీగా వెళ్లి, ఉపాధ్యాయుల బోధనా తీరు గమనించడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి



గురునాథరావు(ఫైల్)

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామ వైఎస్సార్ సీపీ నేత గవర గురునాధరావు అలియాస్ నడిపినాయుడు(83) మృతి చెందారు. కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. మంగళవారం వేకువజామున ఆయన స్వగృహంలోనే మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా సేవలందించిన ఆయన.. పాలకొండ–విశాఖ రోడ్డులో అష్టలక్ష్మి సహిత సాయిగాయత్రి ఆలయం నిర్మించి, పలు ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆలయం వద్దనే ఎంతోమంది నిరుపేదలకు అన్నదానం చేశారు. అంపిలి గ్రామ రోడ్డులో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, 25 మంది అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించడంతో పాటు వారి యోగ క్షేమాలు, ఆరోగ్యాన్ని ఆయనే స్వయంగా చూశారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు సూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేతులమీదుగా స్టూడెంట్ కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలని, బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను తమ వెంట పనులకు తీసుకువెళ్లకుండా పాఠశాలల్లోనే ఉండి చదువుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీడీఈవో పి.నారాయుడు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కురుపాం: ప్రజాసమస్యలు పరిష్కరించండి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొండబారిడి గ్రామంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుండంగి లింగరాజు అధ్యక్షతన కురుపాం మండల సీపీఐ కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి, ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో కొండశిఖర గ్రామాలకు లింకురోడ్లు వేయాలని, ఏనుగుల బెడద లేకుండా చూడాలని, జీడిమామిడి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, సకాలంలో గిరిజన రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేయాలని కోరారు. భవిష్యత్‌లో వీటినే ప్రధానాంశాలుగా చేసుకుని, ఉద్యమిస్తామన్నారు. జూలై 10వ తేదీన శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటయోధులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మాస్టర్ల వర్ధంతి పురస్కరించుకుని, గుమ్మ గ్రామంలో సమావేశం జరుగుతుందని, అందరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు, సింగన్న, మోహన్‌రావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మురుగునీటిలో ప్రజామరుగుదొడ్లు



మురుగునీటిలో మరుగుదొడ్లు

పాలకొండ రూరల్: స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటు వద్ద ఉన్న ప్రజామరుగుదొడ్లు వినియోగంలో లేవు. సరిగా వాటిని నిర్వహించకపోవడంతో పాటు అక్కడి మరుగుదొడ్ల పరిసరాలు చెత్తాచెదారం, మురుగునీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో వాటిని ప్రయాణికులు వాడడం లేదు. వాటిని శుభ్రంగా ఉంచితే వాడొచ్చని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పరిశుభ్రతా చర్యలు చేపట్టి, ప్రజావినియోగంలోకి మరుగుదొడ్లు తీసుకురావాలని కోరుతున్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



యోగా శిక్షణ తరగతుల్లో యోగా ప్రాధాన్యాన్ని వివరిస్తున్న యోగా గురువు రమణమూర్తి

రాజాం సిటీ: మానవ జీవితంలో ప్రస్తుతం తలెత్తుతున్న తీవ్రమైన ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని యోగా గురువు టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక పట్టణంలోని విద్యానికేతన్ స్కూల్‌లో మంగళవారం ఉదయం పురుషులకు, వికాస తరంగిణి కార్యాలయంలో సాయంత్రం మహిళలకు ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, అనారోగ్య సమస్యల బారినపడకుండా ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు. మారిన ఆహారపు అలవాట్లతో ఏ చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా తట్టుకునే పరిస్థితి లేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు యోగా చక్కని ఔషధంలా పనిచేస్తుందన్నారు. యోగా సాధన తో పిల్లల మానసిక ప్రవర్తనలోనూ మార్పు వస్తుందన్నారు. నిత్యం యోగా సాధనతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు.10 రోజుల పాటు సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలు నేర్పించడం జరుగుతుందన్నారు.